


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

129

(22` ఫిబ్రవరి 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**క్రిందటి వ్యాసంలో** దాంపత్యాలలోగల వింతలు కొన్ని వ్రాశాను. కోటానుకోట్ల జంటలున్నాయి ప్రపంచంలో. ఈ అన్నింటిలో అన్ని రకాల తమాషాలు వుంటాయి.

కొందరికి భర్తను పొగడడం ఎంతో సరదా. తనకు దొరికిన ఆ దొరను మించినవాడు మరొకడు ఈ సృష్టిలో వుండడని అలాంటివారి అభిప్రాయం. నిజానికి అలా వుండడంలో కొంత పాతివ్రత్య శోభ గోచరిస్తుందనుకోండి. అతిగా పోతేనే హాస్యాస్పదంగా మారేది.

"వారి బుర్రే వేరు? అసలెలా ఆలోచిస్తారో తెలియదు. ఎవరొచ్చి ఏది అడిగిన ఇలా చెప్పేస్తారు సలహా. వాళ్ళు వంద దణ్ణాలు పెట్టి వెడుతూ వుంటారు.

"అంత తెలివి వూరికే పోతుందండీ ఉచితంగా సలహాలు చెప్పడం మానెయ్యండి, ఉంటే వూహలు మీ మనస్సులోనే వుంటాయి. అవి ఉప్పపడి పోతాయా, చప్పబడిపోతాయా? అంటే వింటారా?

"పోనీలే వాళ్ళు బాగుపడతారు, సంతోషిస్తారు.. మన పేరు చెప్పుకుంటారు. అంతకంటే మనకేం కావాలి? వూహలు వూరికే వచ్చినవేగదా? అలా వుంచితే వృధాగా పోయేవేగదా" అని ఎంతో జాలిగా మాట్లాడతారు.

"మా వారు బట్టలకొట్లో గుమాస్తా చేస్తున్నారు గానీ, నిజానికి బారిస్టరు కావలసింది. ఆ పరీక్ష చదవకుండానే వారికి అన్ని తెలివితేటలు పుట్టుకు వచ్చాయి. చదివితే ఇంకెల వుండేవారో? అసలు బారిస్టరుగా వుంచేవారేమిటి?. ఒక్క సంవత్సరంలో సుప్రీం కోర్టుకు పిలిచేవారు" అని ఒక ఇల్లాలు సంబరాలు పడడంలో ఆశ్చర్యం లేదు.

కొందరు ఏ విషయాన్ని గురించిన సలహా ప్రస్తావన వచ్చినా "అందాకా ఎందుకు? మా వారినడిగితే నిమిషంలో చెప్పేవారుగా. సాయంత్రం నాలుగు గంటలకు రండి. టిఫెన్ తిని తీరిగ్గా వుంటారు. నిమిషంలో చెప్పేస్తారు. అంటూ వుంటారు.

అది బద్రతా సంఘానికి చెందిన విషయం కానివ్వండి. భద్రాచలానికి చెందిన సమస్య అయినా కానివ్వండి. అణుశాస్త్ర పరిశోధన విషయం కానివ్వండి, ఋణశాస్త్ర సమస్యకానివ్వండి. ఆయుర్వేద వైద్య విషయం కానివ్వండి, అంతర్వేది యాత్ర వివరం కానివ్వండి.

"అయ్యో! మా వారిని అడక్కపోయారా? ఒక్క క్షణంలో చెప్పేస్తారు. ఆయనకు తెలియని విషయం వుండదు. సాయంత్రం నాలుగు గంటలకు రండి. టిఫెన్ తిని తీరిగ్గా వుంటారు" అంటూ వుంటారు.

ఒకరెవరైనా చమత్కారానికి "పోనీ సాయంత్రం మూడు గంటలకు వస్తే" అంటారనుకోండి. "అబ్బే కుదరదు. అప్పుడు నిద్రకళ్ళతో వుంటారు నాకే సలహా చెప్పలేరు. మీరేం చెబుతారు. నాలుగుగంటలకైతే నవ్వుతూ మాట్లాడుతారు. పువ్వులు గిరాటు వేసినట్లు సలహాలు చెపుతారు. ఏరుకుని దండలు గ్రుచ్చుకోవడమే మీ పని" అని ఆమె ఎంతో సంబరంగా చెబుతుంది.

"మొన్న ప్రక్కింటి ముసలమ్మ మరిది మీద వేసిన దావా వోడిపోయిందట. మూడు కోర్టుల్లో మరిదే గెలిచాడుట. ఖర్చులు జమకట్టడానికి ఇప్పుడావిడ ఇల్లు బేరం పెట్టిందిట" అంటారనుకోండి.

'అయ్యో ఇల్లమ్ముకోవడమేమిటి? మా వారిని సలహా అడిగితే ఒక్క పుల్లకూడా అమ్మక్కర్లేకుండా పోయేది. వీళ్లైతే ఇల్లు విప్పించి డాబా కూడా వేయించేవారీపాటికి" అని ఆమె అనడంలో ఆశ్చర్యం లేదు.

కొందరు ఇల్లాళ్ళు భర్తలకు సేవ చెయ్యడమంటే తిండి తినిపించడమేననే భావంతో వుంటారు. అన్నం తింటున్నప్పుడు ప్రక్కనచేరి పరాయివాళ్ళు వున్నా సరే, "అదేం తిండి. అందుకనే ఆ బొద్దుతనమంత పోయి బొమికెలు బయటపడ్డాయి. కలపండి ఆ అన్నం కాస్త అంటూ హెచ్చరిస్తూ ఉంటారు.

"అంత తినలేనే? ఆకలి లేదే" అని ఆయన చెప్పుకుంటే "మీ ఆకలు నాకు తెలుసుగానీ మీకేం తెలుసు? మొగమాటానికి పోయి సగానికి సగం తింటున్నారు. మూడు నెలలైంది మీరు సరిగ్గా ముద్ద తిని. నే చెప్పాలేమిటి? ఆ ముఖంలో ముడతలు చెప్పడంలా" అనడం, ఆయన ఎడం చేత్తో ముఖం సవరించుకోవడం ఒదుగుతూ ఉంటుంది.

"మీరు ఆ సాంబారులో ఇంకా కొంచెం అన్నం కలుపుకుని తింటేగాని నేను అన్నం పెట్టి చల్లపొయ్యనసలు. ఏమిటా తిండి. కూర్చున్న కాడినుంచి లేచిపోదామనే చూస్తారు. ఆ తంతూ, తమాషా నాకు తెలియదనుకున్నరా? ఆ అన్నం సాంబారులో కలపండి. నన్ను టోకరా కొడదామని చూస్తే ఎలా? ఈ కొంపలో నేనున్నదెందుకు?" అని బారెడు దీర్ఘం తీయడంకూడా కద్దు.

ప్రక్కన ఎవరన్నా కూర్చుని భోజనం చేస్తున్నప్పుడు "ఆయన్ని చూచి అయినా నేర్చుకోండి. పంక్తి భోజనాలిందుకే పెట్టారు మనవాళ్ళు. ప్రక్కవాళ్ళను చూసి అయినా పట్టెడు అన్నం తినడం నేర్చుకుంటారని" అని ప్రక్కనున్న వారితో "మీరన్నా చెప్పండి.. చంటిపిల్లాడి భోజనం చేస్తున్నారీ మధ్య. ఇంత తిని హరించుకోకపోతే ఇంత బాధ్యతా బరువూ ఎలా మోస్తారు చెప్పండి. ఆయన ఆరోగ్యమే నా భాగ్యం" అని ఒక ఉపన్యాసం దంచుతుంది.

కొందరు భర్తలచేత దొంగ తిళ్ళుకూడా తినిపిస్తూ ఉంటారు అదో వ్రతంలాగా, క్రతువులాగా, నిర్వహిస్తూవుంటారు. కొందరు తల్లులు పసిపిల్లల నోళ్ళను కుట్టిపడేసి భర్తల్ని పడేసి భర్తల్ని బహు సరదాగా మేపుతూ వుంటారు.

పిల్లలకు పంపునీళ్ళలో ఒక చల్లచుక్క వేసి, కంచంలో పోస్తారు. భర్తకు గాజుగ్లాసులో తోడుపెట్టిన పెరుగు చెమ్చాతో తీసిపోస్తూ, చమత్కారంగా మాట్లాడుతూ తినిపిస్తూ ఉంటారు.

పిల్లలు 'మాకేదమ్మా పెరుగు?' అని ఏడిస్తే "పెరగండి పెరుగిస్తుంది. ఇప్పుడెలా వస్తుంది" అని వీళ్లైతే మాడపట్టును ఒక్కటి మెట్టుతారు. "మరి నాన్నకు పోస్తున్నావుగా" అని అడిగితే

"నాన్న సంపాదిస్తున్నారు. మీరేం చేస్తున్నారు? ఆయన రెక్క చక్కగా ఆడితేనే మన డొక్క ఆడేది లేకపోతే మన ముఖం వంక ఎవరు చూస్తారు" అని వాళ్ళను డబాయిస్తుంది. తండ్రి పేరుతో చలామణి అయ్యే మొండిఘటాలు కొన్ని చెవిటివాళ్ళలాగా పిల్లల మాటలు చెవిని వేసుకోకుండానే పోవడం కద్దు.

నాలుగేళ్ళ చంటివెధవ కొంచెం హార్లిక్సు పిండి పెట్టమని ఏడిస్తే "అమ్మో అదే అది ఉండాలి. అది నాన్న మందు. మనం ముట్టుకోకూడదు" అని తీసి సీసా దాస్తుంది. వాడు ఏడిస్తే ఎడాపెడా వాయిస్తుంది. భర్తకు ఎప్పుడు పడితే అప్పుడు కలిపి గ్లాసు అందిస్తూ.

"కాస్త నోట్లో పోసుకు వెళ్ళండి, సావిట్లో కూర్చుంటే ఎవరో ఒకరు వస్తారు. మళ్ళీ త్రాగడానికి వీలుండదు" అని అది ఆయనచేత త్రాగించి ఆయన ఆయుర్దాయం కొంచెం పెరిగినట్లు భావించి తన ఆదుర్దా కొంత తగ్గించుకుంటుంది పాపం.

కొందరు తల్లులు రాత్రిపూట పిల్లలంతా నిద్రపోయిన తరువాత ఏ గారె ముక్కో, పేరంటంలో ఇచ్చిన పంచదార లడ్డో ఏదీ కాకపోతే ఏ వేరుశెనక్కాయ పప్పుండో చేతిలో పెట్టి తినిపించి తనే మూతి తుడిచి, తన సతీత్వాన్ని కాపాడుకున్నట్లు సంతోషపడుతుంది.

నిజానికి ఇలాంటి దొంగతిళ్ళు తినిపించడం క్షుద్ర దేవతోపాసన క్రిందనే జమపడతాయి.

Post your comments